క్లుప్తంగా

18న క్రికెట్ లీగ్

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలాజీ లేఅవుట్ నివాసితులు గ్రూప్ లేఅవుట్‌లోని అన్ని వర్గాల మధ్య స్నేహపూర్వక క్రికెట్ లీగ్‌ను ఈనెల 18న నిర్వహించనున్నారు. 13 సంఘాలు లీగ్‌లో పాల్గొంటున్నాయి. శ్రీ ఎస్వీఆర్ హైస్కూల్, టర్మారిక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, హెల్త్ కేర్ డయాగ్నోస్టిక్, మైనింగ్, ఓ బ్యాంకర్స్ మరెన్నో బ్రాండ్‌లు ఈ ఈవెంట్‌ని విజయవంతం చేయడానికి స్పాన్సర్లుగా మద్దతునిస్తున్నాయి. ఈ టోర్నమెంట్‌కు ఆర్గనైజింగ్ కమిటీ కృష్ణ, మహేష్, అనుప్, బంగారయ్య, అఫ్సర్, కృష్ణ, నళిని తదితరులు వ్యవహరిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

చింతల్: చింతల్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో గురువారం సైదరాబాద్ ఎస్సీ, ఎస్టీ (సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్) ట్రాఫిక్ వలంటీర్లు, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బాలానగర్ ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పలు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తూ వాటిని పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ పంచమ వార్షికోత్సవం



విశేష అలంకరణలో దుర్గామాత

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీ హెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయ ఆవరణలో ఉన్న దుర్గామాత ఆలయ పంచమ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన అభిషేకాలు, హోమం, అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ఆవరణలో భక్తులు దేవీ భాగవతంతో పాటు దుర్గా సూక్తుల పఠనం చేశారు.

జాతీయ కార్మిక సమ్మెను విజయవంతం చేయాలి

జగద్గిరిగుట్ట: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేకంగా నల్ల చట్టాలను తీసుకొస్తుందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌడ ఐలయ్యగౌడ్ అన్నారు. ఈ నెల 16వ తేదీన జాతీయ కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని గాంధీనగర్, రంగారెడ్డినగర్ పారిశ్రామికవాడల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలయ్యగౌడ్ మాట్లాడుతూ... కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక నల్ల చట్టాలను తెచ్చి కార్మికులు సాధించుకున్న హక్కులను కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెట్టిందన్నారు. గ్రామీణ ఉపాధి వ్యవసాయ కార్మికుల పొట్ట కొట్టడానికి చూస్తున్న మోదీ ప్రభుత్వానికి కార్మిక వర్గం తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఐడీపీఎల్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడ వరకు నిర్వహించే బైక్ ర్యాలీలో కార్మిక సంఘం నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు.

శుభాకాంక్షలు



అనిల్‌కుమార్ యాదవ్‌ను సత్కరిస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్ కుమార్ యాదవ్‌ను గురువారం ఆయన మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ యువ నేతలకు ఎప్పుడూ అవకాశం కల్పిస్తూనే ఉంటుందన్నారు.

నాణ్యత పాటించాలి

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ పనుల్లో నాణ్యత పాటించడంతో బాటు సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ అన్నారు.గురువారం పటాన్‌చెరు డివిజన్ పరిధి బండ్లగూడలో నూతనంగా నిర్మిస్తున్న అంతర్గత డ్రైనేజీ పనులను హెచ్‌ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో బండ్లగూడ కాలనీవాసులు పాల్గొన్నారు.

పాదచారులకు దారేది..?

- పార్కింగ్‌కు అడ్డాగా మారుతున్న ప్రధాన రహదారులు
- ఫుట్‌పాత్‌లను దుకాణాలతో ఆక్రమించేస్తున్న చిరువ్యాపారులు
- చేసేది లేక రోడ్లపై నుంచి వెళ్తున్న పాదచారులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో ప్రధాన రహదారులు పార్కింగ్‌లకు అడ్డాగా మారాయి. ఎక్కడ చూసినా రోడ్లపైనే వాహనాలు నిలిపి పక్కనే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. పలు పర్యాయాలు ట్రాఫిక్ పోలీసులు చలానా విధించినప్పటికీ డోంట్ కేర్ అన్నట్లుగా ఉంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీగా ఉండే ప్రధాన రహదారుల వెంట చిరువ్యాపారాలు, ఇతర వాణిజ్య సంస్థల ముందు కిలోమీటర్ల మేర పార్కింగ్ ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ ప్రాంతాల్లో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఫుట్ పాత్‌లు సైతం ఆక్రమిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రోడ్డు పక్కన ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని కోరుతున్నారు.

– కుత్బుల్లాపూర్



గాజులరామారం- షాపూర్‌నగర్ రోడ్డులో ఆటోల మరమ్మతులు



సుచిత్ర చౌరస్తాలో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారాలు



సూరారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద..



జీడిమెట్ల బస్‌డిపో నుంచి ఎస్ఆర్ నాయక్‌కు వెళ్లే దారిలో ఇలా..

మొక్కలు నాటి వదిలేస్తే ఎలా?

రంగారెడ్డినగర్: రహదారుల వెంబడి ఫుట్‌పాత్‌లపై నాటిన మొక్కల నిర్వహణను అధికారులు గాలికొదిలేయడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. జంట సర్కిళ్ల పరిధిలోని ప్రధాన రోడ్ల వెంబడి పచ్చదనాన్ని పెంపొందించేందుకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఫుట్‌పాత్‌లపై మొక్కలను నాటారు. అయితే వాటి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రతినిత్యం నీటిని వేయాల్సి ఉండగా ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు. దీంతో నాటిన కొద్ది రోజులకే మొక్కలు మాయమయ్యాయి, కొన్ని చోట్ల ఫుట్‌పాత్ వ్యాపారులు తమకు అడ్డుగా ఉన్నాయని వాటిని విరగ్గొట్టడంతో నేడు మోడువారి కనిపిస్తున్నాయి.. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం సమీపంలో హెచ్‌ఎంటీ గోడను ఆనుకుని ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన మొక్కలు నేడు కనుమరుగయ్యాయి. పర్యావరణాన్ని పెంపొందించడంతో పాటు నీడనిచ్చే మొక్కలను కాపాడటంతో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సర్కిల్ చౌరస్తా ప్రాంతంలో మొక్కలను నాటి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.



హెచ్‌ఎంటీ గోడను ఆనుకుని ఫుత్‌పాట్‌పై మోడులుగా మారిన మొక్కలు

పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలి



షాపూర్‌నగర్‌లో మాట్లాడుతున్న సీఐటీయూ నేత లక్ష్మణ్

కుత్బుల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభించడంతో పాటు ప్రజల మధ్య మతపరమైన చిచ్చు పెడుతోందని సీఐటీయూ కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఈనెల 16న భారత్ బంద్ నేపథ్యంలో గురువారం షాపూర్‌నగర్ అడ్డా వద్ద తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ... కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. కార్మిక చట్టాలను అమలు చేయకుండా వాటికి అనేక తూట్లు పొడుస్తూ మొత్తం కార్మిక చట్టాలనే ఎత్తివేయాలనే కుట్ర చేస్తోందన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి జీడిమెట్ల పారిశ్రామిక వాడ మీదుగా సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ, ఐఎన్‌టీయూసీ, బీఆర్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో జరిగే ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖలీల్ శ్రీనివాస్, స్వాతి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలి



బాచుపల్లిలో సీఐటీయూ, ఐఎన్‌టీయూల ఆధ్వర్యంలో ర్యాలీ

నిజాంపేట్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపితేనే శ్రామికవర్గానికి మనుగడ ఉంటుందని సీఐటీయూ జిల్లా నాయకుడు చంద్రశేఖర్ అన్నారు. ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె ప్రచారంలో భాగంగా గురువారం బాచుపల్లి ఇండస్ట్రియల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో బాచుపల్లి మున్సిపల్ వార్డు కార్యాలయం, ఇండస్ట్రియల్ ఏరియాలో కార్మికులతో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పదేళ్ల బీజేపీ పాలనలో రైతాంగం, శ్రామిక వర్గం జీవన ప్రమాణాలు అత్యంత దయనీయంగా మారాయని అన్నారు. కార్మికులకు కనీస జీతాలు లేక రోడ్డున పడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేల అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు ఎల్లమ్మ, శ్రీను, ప్రవీణ్, యాదగిరి, మాణిక్యం, స్వామి, ఐఎన్‌టీయూసీ నాయకులు కోటేశ్వరరావు, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



చిత్రమయిలో ఆర్ట్‌టాక్ షో

మాదాపూర్: కళాకారులు ఆసక్తితో పెయింటింగ్ నేర్చుకోవాలని కళాకారుడు ప్రభాకర్ కోల్టె తెలిపారు. బొంబాయికి చెందిన ప్రభాకర్ మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ ఆడిటోరియంలో గురువారం ఆర్ట్‌టాక్ షోను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న చిత్రకారులకు ఆర్ట్ ప్రాక్టీస్, అబ్‌స్ట్రాక్ ఆర్ట్‌ల గురించి వివరించారు. విద్యార్థులకు అబ్‌స్ట్రాక్ట్ ఆర్ట్‌లపై మెళకువలను నేర్పించారు. కార్యక్రమానికి నగరంలోని కళాకారులు పాల్గొన్నారు.

'ఇమ్యునో అంకాలజీ' పై సదస్సు



కాంటినెంటల్ ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యబృందం

రాయదుర్గం: ఇమ్యునోథెరపీ అపోహలను తొలగించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రముఖ కేన్సర్ పరిశోధకులు డాక్టర్ కీత్‌ఫ్లాహెర్టీ పేర్కొన్నారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలో కేన్సర్ అవేర్‌నెస్ నెలలో భాగంగా ఇమ్యునో అంకాలజీలో అడ్వాన్సెస్‌పై ఇంటరాక్టివ్ సెషన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యవక్తగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో అనేక మార్పులు వచ్చాయని, శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. జన్యు ఆధారిత చికిత్సల అభివృద్ధి, చికిత్స నిరోధకతను పరిష్కరించడానికి వ్యూహాలు, వ్యక్తిగతీకరించిన చికిత్సను అభివృద్ధి చేయడంలో కీలకపాత్ర పోషించాయన్నారు. పరిశోధకులు డాక్టర్ రమీ ఇబ్రహీమ్ మాట్లాడుతూ ఊపిరితిత్తుల కేన్సర్, మూత్రాశయ, మెదడు, బ్రెస్ట్ కేన్సర్ల చికిత్సా పురోగతిని వివరించారు. కాంటినెంటల్ ఆస్పత్రి సీనియర్ మెడికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్ మాట్లాడుతూ వ్యక్తిగత ఇమ్యునోథెరపీ, టార్గెట్ ఇమ్యునోథెరపీపై పలు అధ్యయనాలను వివరించారు. ఇన్ఫర్మేటివ్ సెషన్ కార్యక్రమంలో కాంటినెంటల్ ఆస్పత్రి కేన్సర్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ జగన్నాథ్, చైర్మన్ డాక్టర్ గురు ఎన్ రెడ్డి, మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ ఏవీఎస్ సురేష్, ఇతర డాక్టర్లు, పరిశోధకులు పాల్గొన్నారు.

'నీ చూపు చెప్పింది నాకు' పుస్తకావిష్కరణ



మాదాపూర్: వర్ధమాన రచయిత కొరటమద్ది హేమంత్ తొలి నవల 'నీచూపు చెప్పింది నాకు' పుస్తకాన్ని ప్రముఖ నటులు,రచయిత,దర్శకులు తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. మాదాపూర్‌లోని ఫినిక్స్ ఎరీనాలోని ర్వహించిన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఆదిత్య, రచయిత ,నటులు అవసరాల శ్రీనివాస్ ,నిర్మాత వంశీ చాగంటి పాల్గొన్నారు. సిరివెన్నెల సీతారామశాస్త్రి సోదరుడు శ్రీరామశాస్త్రి సభాధ్యక్షులుగా వ్యవహరించారు. తొలి ప్రయత్నంలోనే విశ్లేషణాత్మకంగా రచించిన హేమంత్‌ను అభినందించారు.తనును ఆది నుంచి ప్రోత్సహించిన భరణి, రచయిత ఆకెళ్ల రాఘవేంద్ర తదితరులకు హేమంత్ ధన్యవాదాలు తెలిపారు.

టెస్ట్ డ్రైవ్.. డెత్ డ్రైవ్

జీడిమెట్ల: అజాగ్రత్తగా అతివేగంతో కారును టెస్ట్ డ్రైవ్ చేస్తూ వాచ్‌మెన్‌ను ఢీకొట్టడంతో అతను మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నాయుడు వివరాల ప్రకారం.. ఐడీపీఎల్ ఏపీహెచ్‌బి కాలనీకి చెందిన బక్కన్నగారి పెద్దోళ్ల శివయ్య(65) చింతల్‌లోని అగ్రోస్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం శివయ్య డ్యూటీకి వెళ్లాడు. ఉదయం 11గంటలకు గేటు వద్ద కుర్చీలో కూర్చుని ఉన్నాడు. అదే అగ్రోస్ కంపౌండ్‌లో రాఘవేంద్ర మోటర్స్ ఉంది. అందులో పనిచేసే మెకానిక్ ఇమ్రాన్ కారును టెస్ట్‌డ్రైవ్ చేస్తూ వేగంగా నడిపాడు. ఈక్రమంలో అక్కడే కుర్చీలో కూర్చుని ఉన్న శివయ్యను ఢీకొట్టగా ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే శివయ్యను షాపూర్ నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్ ధృవీకరించాడు. మృతుడు శివయ్య భార్య రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

శేరిలింగంపల్లి: వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయధ్వానాల నడుమ శివపార్వతుల కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నల్లగండ్లలోని శివాలయం వార్షికోత్సవం సందర్భంగా గురువారం మాధవానంద సరస్వతిస్వామి పర్యవేక్షణలో బ్రహ్మోత్సవం, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ పూజల్లో శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ పాల్గొని శివపార్వతుల కల్యాణాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనడంతో ఆస్పత్రి ప్రాంగణం సందడిగా మారింది. కార్యక్రమంలో సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, నల్లగండ్ల వాసులు పాల్గొన్నారు.



కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డుల అందజేత

కుత్బుల్లాపూర్: కమ్యూనిస్టులు పోరాటాల వల్లే పన్నుల్లో రెండు శాతం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కేటాయిస్తూ ప్రభుత్వం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసిందని సీపీఐ కార్యదర్శి ఉమామహేశ్ అన్నారు. గురువారం షాపూర్‌నగర్‌లోని భవన నిర్మాణ కార్మికుల అడ్డా వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులకు ప్రభుత్వ గుర్తింపు కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ... ప్రభుత్వ వసూలు చేసే పన్నుల్లో 2 శాతం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డుకు వెళ్తుందన్నారు. గుర్తింపు కార్డులు ఉంటే కార్మికులకు ప్రమాద బీమా, పిల్లల పెళ్లిళ్లకు, కాన్పులకు ఆర్థిక సహాయం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రాము, భవన నిర్మాణ కార్మికుల నాయకులు ప్రభాకర్, కనకయ్య, చంద్రమౌళి, వెంకన్న, ప్రమీల, చంద్రమ్మ, బాలమణి, మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

మురుగు కలవకుండా మరమ్మతులు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట డివిజన్ షిర్డీహిల్స్‌లోని రోడ్డు నం.3, 4, 5లో ఉన్న మంజీరా పైపులైన్‌లో డ్రైనేజీ నీరు కలుస్తోంది. ఈ విషయాన్ని స్థానిక సంక్షేమ నేతలు వాటర్ వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టారు.

కనులపండువగా బ్రహ్మోత్సవాలు



వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట: లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి కరుణ కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని.. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జేక్ శేఖర్‌యాదవ్, ఆలయ చైర్మన్ వేణుయాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పున్నారెడ్డి, నాయకులు మేకల సురేష్‌రెడ్డి, మోతె శ్రీనివాస్‌యాదవ్, సిద్దిరాంరెడ్డి, ఓరుగంటి నరేష్, వసుంధర, గండి రాజుయాదవ్, మాధవులు, అరుణ్ కుమార్, జగ్గు, రేవంత్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహా భోగ్ భండార్ ధూంధాం



ఊరేగింపులో పాల్గొన్న బంజారాలు

సుభాష్‌నగర్: అటవీ ప్రాంతాల్లో నివాసముండే బంజారాల గురించి ప్రపంచానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి సంత్ సేవాలాల్ మహారాజ్ అని బంజారా నాయకుడు జటావత్ చంద్ర నాయక్ అన్నారు. సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని గురువారం కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో మహాభోగ్ భండార్ ధూంధాం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గల్లీలలో బంజారాలు కుటుంబ సమేతంగా కలిసి ఊరేగింపు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగయ్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యాపారి మృతి

జీడిమెట్ల: అనుమానాస్పద స్థితిలో ఓ కట్టెల వ్యాపారి మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసరావు వివరాల ప్రకారం.. చింతల్ భగత్‌సింగ్ నగర్‌కు చెందిన ల్యాగల జానయ్య రామకృష్ణానగర్‌లో 30సంవత్సరాలుగా కట్టెల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి 9గంటలకు జానయ్యకు కట్టెల దుకాణం నుంచి ఫోన్ రావడంతో దుకాణానికి వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం జానయ్య భార్య భూదెమ్మకు దుకాణం చుట్టు పక్కల వారు ఫోన్ చేసి జానయ్య ఉరేసుకుని మృతిచెందాడని తెలిపారు. వెంటనే దుకాణం వద్దకు వెళ్లిన భూదెమ్మ చూసేసరికి జానయ్య రేకుల కట్టెకు నైలాన్ తాడుతో ఉరేసుకుని కనిపించాడు. భూదెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



అమరావతి, అభిలాష్‌ల పెళ్లినాటి ఫొటో

సుభాష్‌నగర్: అత్తింటి వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన బట్ట అభిలాష్, అమరావతి వివాహం మూడేళ్ల క్రితం జరిగింది. వివాహ సమయంలో 550 గ్రాముల బంగారు, 2కిలోల వెండి ఆభరణాలు, రూ.10లక్షల నగదు కట్న కానుకలుగా ఇచ్చారు. అంతే కాకుండా అమరావతి పేరుపై హయాత్‌నగర్‌లో పుట్టింటి వారు ఇచ్చిన రూ.3కోట్ల విలువ చేసే ప్లాట్ ఉంది. పెళ్లైన కొద్ది రోజుల పాటు వీరి సంసారం సజావుగానే సాగింది. కొద్ది రోజులుగా భర్త అభిలాష్‌తో పాటు అత్తమామలు అనురాధ, శ్రీశైలంలు అదనపు కట్నం తేవాలంటూ అమరావతిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురి చేస్తూ వస్తున్నారు. వేధింపులు తీవ్రం కావడంతో మానసికంగా కుంగిపోయిన అమరావతి గురువారం ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఒక కుమారుడు (01) ఉన్నాడు. అత్తింటి వారి వేధింపుల వల్లే తమ కుమార్తె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లిలోని ఎస్సీ బస్తీకి చెందిన శివయ్య(55) గత నెల 16న ఇంటి ముందు నిలుచుని ఉండగా కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శివయ్యను గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.